క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం

నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండలాధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది.
నెల్లూరు నగర నియోజకవర్గం..
క్లస్టర్ – ఒకటి (3, 4, 5, 6, 7, 8, 9, 10 డివిజన్లు) దొంతాల రఘురామయ్య.. క్లస్టర్ – 2 (11, 13, 14, 15, 16, 39, 40) ఉప్పల శేషగౌడ్.. క్లస్టర్ – 3 (42, 43, 44, 45, 46, 47) ఆరిఫ్ హుస్సేన్.. క్లస్టర్ – 4 (48, 49, 50, 51, 52, 53, 54) బాలశంకర్‌రెడ్డి.
నెల్లూరు రూరల్ నియోజకవర్గం..
క్లస్టర్ – 1 (1, 2, 12, 17, 18, 19) రామిరెడ్డి.. క్లస్టర్ – 2 (20 నుంచి 25) ప్రభాకర్‌రెడ్డి .. క్లస్టర్ – 3 (26 నుంచి 31) వెంకట శ్రీకమల్.. క్లస్టర్ – 4 (32 నుంచి 38, 41) బెజవాడ మేఘనాథ్‌సింగ్.. నెల్లూరు రూరల్ పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నెల్లూరు రూరల్: మండలంలోని 18 పంచాయతీల్లో శనివారం నుంచి వచ్చే నెల 27 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నామని రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్‌మోపూరు, అల్లీపురం పీహెచ్‌సీల వైద్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, కవిత, హజరత్ రెడ్డి, బలరామ్‌నాయక్ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు ప్రజలకు వైద్యసేవలను అందించనున్నారని చెప్పారు. 30న వెల్లంటి, అక్టోబర్ 3న మాదరాజుగూడూరు, 6న ఆమంచర్ల, 7న దేవరపాళెం, 10న గొల్లకందుకూరు, 13న ములుమూడి, 17న కాకుపల్లి, 19న పెనుబర్తి, 20న దొంతాలి, 26న కందమూరు, 27న కొండ్లపూడిలోని పాఠశాలల్లో శిబిరాలను నిర్వహించనున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విషజ్వరాలపై అవగాహన అవసరం



నెల్లూరు(బారకాసు): విష జ్వరాలపై అవగాహన అవసరమని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా రాజారామిరెడ్డినగర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ పరిధిలో గల పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని పలు గృహాలను సందర్శించి నీటి నిల్వలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి లార్వా, ఫీవర్ సర్వేను ఆశ, ఆరోగ్య కార్యకర్తలు చేపట్టి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ రుణాలపై సమీక్ష



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో గల టిడ్కో గృహాలకు సంబంధించిన రుణాల మంజూరు పురోగతిపై కమిషనర్ వికాస్ మర్మత్ సమీక్షించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో హౌసింగ్, మెప్మా, కార్పొరేషన్ హౌసింగ్ విభాగాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహాలు తీసుకునేందుకు ఆసక్తి చూపని వారి స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయాలని ఆదేశించారు.

సింహపురిలో సినిమా షూటింగ్



నెల్లూరు(బృందావనం): నాలుగో మైలు, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో లింబో సినిమా షూటింగ్‌ను శుక్రవారం నిర్వహించామని చిత్ర దర్శకుడు, నటుడు మురళీమోహన్‌రాజు తెలిపారు. ఎస్వీఎస్ క్రియేషన్స్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ఈ ప్రాంతంలో చిత్రీకరించామన్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు రూపారెడ్డి, శ్వేతశ్రీ, తేజశ్రీ, నిర్మాత కోడూరు శైలజ, సహ దర్శకుడు సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కెమెరామెన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు తలెత్తకూడదు



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 15 నుంచి 23 వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా చూడాలని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతర విద్యుత్ సరఫరా.. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పొరపాట్లను సరిదిద్దుకొని, గతంలో కంటే ఘనంగా నిర్వహించాలని కోరారు. తొలుత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మేయర్ పొట్లూరి స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ మలోల, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో తండ్రీకొడుకుల రికార్డు



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): భారీ కుంభకోణంలో అవినీతిపరులుగా తండ్రీకొడుకులు చరిత్రకెక్కారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు జైలుకెళ్లగానే ఆయన తనయుడు లోకేశ్ యువగళాన్ని వదిలేసి ఢిల్లీలో కూర్చున్నారని చెప్పారు. న్యాయస్థానాలు, న్యాయవ్యవస్థపై టీడీపీ శ్రేణులు తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులని వారు భావిస్తే నిరసనలను ప్రజాక్షేత్రంలో కాకుండా టీడీపీ కార్యాలయాల్లో చేయడం ఏమిటన్నారు. జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్తతో ప్రశాంత్ కిశోర్ మాట్లాడి.. చంద్రబాబును అరెస్ట్ చేయడం తప్పంటూ చెప్పారని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారని, సదరు పారిశ్రామికవేత్త ఎవరో తెలియజేయాలని ప్రశ్నించారు. అసత్య ఆరోపణలను మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ భూ స్థాపితమని ఆ పార్టీ రాజకీయ సలహాదారు రాబిన్ శర్మ తనతో చెప్పారని పేర్కొన్నారు.

సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం



సమస్యలను తెలుసుకుంటున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ డేలో సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, అనధికారికంగా గైర్హాజరవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. స్పెషల్ పార్టీ సిబ్బంది పోస్టింగ్‌ల విషయంలో ఒత్తిడి చేయొద్దని, నిబంధనలకు అనుగుణంగా కల్పిస్తామన్నారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుళ్ల సమస్యలపై సత్వరమే తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వ్యాయామంతో హృద్రోగ సమస్యలు దూరం



నెల్లూరు(బారకాసు): నిత్యం వ్యాయామం చేయడం, మంచి జీవనశైలితో గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉండొచ్చని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని చింతారెడ్డిపాళెంలోని నారాయణ హాస్పిటల్లో అవగాహన, ప్రత్యేక హార్ట్ చెకప్ ప్యాకేజీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శుక్రవారం హాజరైన ఆయన మాట్లాడారు. రోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయడం అవసరమని తెలిపారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. తమ హాస్పిటల్లో హెల్త్ చెకప్‌లో రెండు రకాల ప్యాకేజీలను అందుబాటులో ఉంచామని వివరించారు. హార్ట్ స్క్రీనింగ్ ప్యాకేజీలో కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్‌తో పాటు డాక్టర్ సూచించిన వారికి టీఎంటీతో సహా రూ.నాలుగు వేల విలువ జేసే పరీక్షలను రూ.1200కే చేయనున్నామని పేర్కొన్నారు. అక్టోబర్ 28 వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఏఎమ్మెస్ డాక్టర్ హరీష్, డీఎమ్మెస్ డాక్టర్ అరుణ్‌కాంత్, సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ ద్వారకానాథ్, ఏజీఎం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూడో రాష్ట్ర జట్టుకు అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జాతీయ సీనియర్స్ జూడో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును నెల్లూరులో ఎంపిక చేశామని జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. సుబేదారుపేటలోని జూడో క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో అక్టోబర్ ఒకటి నుంచి ఐదు వరకు నిర్వహించనున్న జాతీయ సీనియర్స్ జూడో చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులకు అభినందించారు.

క్రైమ్ కార్నర్

ఉరేసుకొని ఆత్మహత్య



నెల్లూరు రూరల్: చెట్టుకు ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యలమవారిదిన్నె సమీపంలోని పద్మావతి గ్రీన్‌సిటీ లేఅవుట్లో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై సమాచారం అందుకున్న వీఆర్వో గంగాధర్‌రావు అక్కడికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలియలేదు. నెల్లూరు రూరల్ పోలీసులకు వీఆర్వో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: గుర్తుతెలియని బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అల్లీపురం దళితవాడకు చెందిన కొండూరు మల్లికార్జున్ (50) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. నెల్లూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. అల్లీపురంలోని దళితవాడకు చెందిన మల్లికార్జున్, శేషమ్మ దంపతులు కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవారు. కూలీ పనులకు బుధవారం ఆయన వెళ్లారు. గుడిపల్లిపాడు నుంచి అల్లీపురానికి రాత్రి వేళ నడిచి వెళ్తున్న ఆయన్ను నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని బైక్ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో మల్లికార్జున్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహనచోదకుడు పరారయ్యారు. కుటుంబసభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చెన్నైకు తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. చికిత్సకు చెన్నైలోని వైద్యులు నిరాకరించగా, నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించాలని భావించారు. అయితే అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు రూరల్: వ్యక్తి అదృశ్యంపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. నారాయణరెడ్డిపేటకు చెందిన కొండా శంకర్ పేకాటకు బానిసై పలువురి వద్ద అప్పులు చేసి గతంలోనూ ఇంటి నుంచి పలు మార్లు వెళ్లి తిరిగొచ్చేవారు. తాజాగా ఆయన అదృశ్యంపై భార్య వెంకటసునీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

నెల్లూరు(టౌన్): పదో తరగతిలో ఉత్తమ మార్కులను సాధించిన పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు పురస్కారాలను స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. 2022 – 23 విద్యాసంవత్సరంలో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున ప్రదానం చేశారు. డిప్యూటీ డీఈఓ ప్రసన్న లక్ష్మి, ఎంఈఓ – 2 మురళి, స్పందన ఫౌండేషన్ సెక్రటరీ సురేష్‌బాబు, మున్సిపల్ లీగల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు రంగారావు, తెలుగు సమాఖ్య అధ్యక్షుడు బలరామనాయుడు, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కంచి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా సర్వరాజు శ్యామ్‌సుందర్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

ఘనంగా అమృత కలశ యాత్ర

నెల్లూరు(టౌన్): నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీనగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అమృత కలశ యాత్రను శుక్రవారం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఆయేషా, ప్రధానోపాధ్యాయుడు ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సేవలో రాష్ట్ర విజిలెన్స్ అధికారి



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర విజిలెన్స్ అధికారి మూర్తి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వీరికి అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రామారావు, కో ఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు జోజీ పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. డాలర్ల రూపంలో రూ.92,166, ఇతర కానుకలతో కలిపి మొత్తం రూ.17,46,797 మేర లభించింది. అన్నదానానికి సంబంధించిన విరాళాలు రూ.33,534 మేర అందాయి. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నా భూమి - నా దేశం



నెల్లూరు(బారకాసు): నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని నగరంలోని అన్ని సచివాలయాల స్థాయిలో నిర్వహించారు. దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించేలా అమృత కలశ యాత్రను జరిపారు. సచివాలయ వార్డు అడ్మిన్ కార్యదర్శుల నేతృత్వంలో ప్రజలతో పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించారు.

ముగిసిన స్కూల్ గేమ్స్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ శుక్రవారంతో ముగిశాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి విజయ తెలిపారు. సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, సైక్లింగ్, సెపక్ తక్రా, రైఫిల్ షూటింగ్, యోగాకు సంబంధించిన ఎంపికలకు దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఈఓ గంగాభవానీ, క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ నాగరాజకుమారి, చీఫ్ కోచ్ యతిరాజ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వ్యాయామ, ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, థామస్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎమ్సీఏ సబ్‌స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గల కేబుల్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంప్లెక్స్ రోడ్డు, పొగతోట, సోమశేఖరపురం, జయభారత్ ఆస్పత్రి, ఆచారివీధి, వీఆర్ కాలేజీ, ట్రంక్ రోడ్డు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

వేడుకగా సత్యనారాయణ వ్రతం



వ్యాసరాజ మఠంలో..



కృష్ణ మందిరంలో..

నెల్లూరు(బృందావనం): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని సంతపేట బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలో గల సత్యనారాయణస్వామి మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు కృష్ణాచార్ ఆధ్వర్యంలో జరిపారు. సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, మందిర గౌరవ కార్యనిర్వాహకుడు అరవపల్లి సుబ్బారావు, మందిర మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు పాల్గొన్నారు.
- వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయ్‌కుమార్‌రెడ్డి, వాణిమల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు రూరల్: హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో గల కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పార్లమెంట్ పోటీల్లో కొత్తూరు కేంద్రియ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని అందుకున్నారు. విజేతలను శుక్రవారం అభినందించిన అనంతరం ప్రిన్సిపల్ శంకరయ్య మాట్లాడారు. ఆరు కేంద్రీయ విద్యాలయాలు తలపడగా, తమ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడంపై ఆనందం వ్యక్తం చేశారు. నవంబర్‌లో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు జోషీబాబు, దొరసానమ్మకు అభినందనలను తెలియజేశారు. ఉపాధ్యాయులు రవి, అశోక్, సంధ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎనెల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ర్యాలీ



నెల్లూరు(బారకాసు): వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని అవగాహన ర్యాలీని ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వనంతోపు సెంటర్ నుంచి ఎన్టీఆర్ పార్క్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్‌యాదవ్ మాట్లాడారు. గుండె వ్యాధులు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక చికిత్స తదితరాలపై అవగాహన కల్పించారు. హాస్పిటల్ చైర్మన్ దశరథనాగేంద్రప్రసాద్, సూపరింటెండెంట్ ప్రణీత, రవికుమార్, న్యాయవాది వేలూరు రంగారావు, రఘురామ్ ముదిరాజ్, బాలసుధాకర్, శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (పొగతోట): నగరానికి శుక్రవారం వచ్చిన ప్రభుత్వ సలహాదారుడు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డిని ఏపీ ఎన్జీఓ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, నాయుడు వెంకటస్వామి, లక్కాకుల పెంచలయ్య, మార్కండేయులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం



నెల్లూరు(బారకాసు): గుండె వ్యాధులపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీబొమ్మ సెంటర్ నుంచి దర్గామిట్టలోని కిమ్స్ హాస్పిటల్ వరకు 3కే వాక్‌ను ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, హాస్పిటల్ ఈడీ గిరినాయుడు, చీఫ్ కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు, గుండె వైద్య నిపుణులు సాహెబ్‌పీర్, నాగరాజరావు, మెడికల్ సూపరింటెండెంట్ ఏవీ రెడ్డి, వైద్యులు రంగారావు, జగదీష్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆర్నెల్ల జైలు

నెల్లూరు (లీగల్): అప్పు తీసుకొని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కును ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో బీవీనగర్‌లోని వైఎల్‌ఎన్నెస్ కల్యాణ మండప వీధికి చెందిన గూడూరు భానుప్రకాష్‌కు ఆర్నెల్ల జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.9.85 లక్షల పరిహారాన్ని చెల్లించాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పినాపాటి భరద్వాజ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు.. నవలాకులగార్డెన్స్‌లోని సాయినగర్‌కు చెందిన సాయికుమారి వద్ద రూ.ఏడు లక్షలను తన అవసరాల నిమిత్తం 2015, అక్టోబర్ 8న భానుప్రకాష్ తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రామిసరీ నోటును రాసిచ్చారు. అప్పును తిరిగి చెల్లించే క్రమంలో 2017, సెప్టెంబర్ 20న రూ.9.85 లక్షల మేర చెక్కును ఎస్బీఐ, వేదాయపాళెం బ్రాంచ్ పేరిట ఇచ్చారు. సదరు చెక్కును అదే నెల 27న చిన్నబజార్‌లోని ఆంధ్రా బ్యాంక్ శాఖలో గల తన ఖాతాకు జమ చేయగా, నగదు లేని కారణంగా బౌన్సైంది. ఫిర్యాది తన అడ్వొకేట్ ద్వారా అదే ఏడాది అక్టోబర్ 26న లీగల్ నోటీసును పంపి కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ క్రమంలో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.

‘మెడికవర్’లో వరల్డ్ హార్ట్ డే



నెల్లూరు(బారకాసు): చింతారెడ్డిపాళెంలోని మెడికవర్ హాస్పిటల్లో ప్రపంచ గుండె దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత కేక్‌ను కట్ చేసి గుండె పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజీ వైద్య బృందాన్ని సత్కరించిన అనంతరం సీనియర్ కార్డియాలజిస్ట్ విజయ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడారు. రూ.22 వేల విలువజేసే యాంజియోగ్రామ్ పరీక్షను రూ.6999కు, రూ.మూడు వేల విలువైన కార్డియాలజీ కన్సల్టేషన్, 2డీ ఎకో, ఈసీజీ పరీక్షలను రూ.599కే చేయనున్నామని వెల్లడించారు. అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్డియాలజీ వైద్య బృందం రామ్‌ప్రసాద్, జయరామ్, లోకేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలపై అవగాహన

నెల్లూరు(సెంట్రల్): వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని నగరంలోని ప్రధాన, వేదాయపాళెం రైల్వేస్టేషన్లలో అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. రైల్వే డాక్టర్ శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. సూపరింటెండెంట్ మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవం

నెల్లూరు(బృందావనం): కోటమిట్టలోని మీరామొహిద్దీన్ షా దర్గాలో గంధ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. జెండాను శనివారం ప్రతిష్టించి, తహలీల్ ఫాతేహాను నిర్వహించనున్నామని దర్గా ప్రెసిడెంట్ హాజీ కరిముల్లా తెలిపారు.